బాధిత కుటుంబానికి ఎస్ఆర్ రెడ్డి పరామర్శ

తిరుపతయ్యను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్ రెడ్డి

మరికల్, డిసెంబర్ 17 : మండలంలోని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు లంబాడి తిరుపతయ్య తల్లి నర్సమ్మ ఆదివారం మృతి చెందిన విషయం తెలుసుకొని మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి ఆదివారం కుటుంబాన్ని పరామర్శించారు. నర్సమ్మ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించి తిరుపతయ్యను ఓదార్చారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు సంపత్‌కుమార్, రాజవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ గోవర్ధన్, ఎంపీటీసీ సూజాతశ్రీనివాస్, గోపాల్, రామస్వామి, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం

ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రబృందం

ఆత్మకూరు, డిసెంబర్ 17 : అకాలమరణం చెందిన స్నేహితుడి కుటుంబానికి చేయూతనందించారు తన మిత్రబృందం. ఆదివారం పట్టణంలోని రాజవీధికి చెందిన శ్రీనివాసులు నెలరోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. పేద కుటుంబీయుడైన స్నేహితుడికి ఆదుకునేందుకు శ్రీనివాసులు మిత్రులు ఆర్థికసాయం అందజేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1993-94 బ్యాచ్ స్నేహితులందరూ ఆదివారం తమ మిత్రుడు శ్రీనివాసులుకు సంతాపాన్ని తెలిపారు. అనంతరం రూ. 50 వేలు నగదును భార్య నవనీతకు అందజేశారు.

భగవద్గీత కంఠస్థ పోటీల్లో ప్రథమ బహుమతి

ధన్వాడ, డిసెంబర్ 17 : విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీల్లో మండల కేంద్రానికి చెందిన సాయి సరస్వతి పాఠశాలలో నందుకు ప్రథమ బహుమతి వచ్చిందని కరస్పాండెంట్ మరాఠి నారాయణ తెలిపారు. రాష్ట్రం నుంచి 18 జిల్లాల నుంచి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. బహుమతిని అఖిల భారతీయ విశ్వ హిందు పరిషత్ ప్రధాన కార్యదర్శి సత్యం అందజేశారు. నందుకు మొదటి బహుమతి లభించడం పట్ల ఉపాధ్యాయ బృందంతో పాటు సర్పంచ్ చిట్టెం అమరేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు గోవర్ధన్‌గౌడ్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

విజయవంతమైన వైద్య శిబిరం

నారాయణపేట, డిసెంబర్ 17 : పట్టణంలోని అశోక్‌నగర్‌లో ఆదివారం ఫిర్దౌస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. అమెరికాలో స్థిరపడిన వైద్యుడు మహ్మద్ జహీర్ శిబిరంలో పాల్గొని 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

రాజీమార్గమే రాజ మార్గం

మక్తల్ టౌన్, డిసెంబర్ 17 : రాజమార్గమే రాజమార్గమని సమస్యలు పరిష్కారమవుతాయని సీఐ రామ్‌లాల్ అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పలు సమస్యల్లో ఇరువురి మధ్య కేసులు నమోదు చేసుకున్న బాధితుల కోసం లోక్ అదాలత్ ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 30వ తేదీన మక్తల్ సర్కిల్ పరిధిలోని బాధితులు లోక్‌అదాలత్‌లో పాల్గొని బాధితులందరూ రాజీ పడాలని సూచించారు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పూర్వ విద్యార్థులు బృందం

పెబ్బేరు, డిసెంబర్ 17 : మున్సిపాలిటీ పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1999-2000 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు స్థానిక ఓ ఫంక్షన్ హాల్లో సమావేశమై విద్యాబోధ చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ ,ఎమ్మెల్యే

- అట్టహాసంగా ప్రారంభమైన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్
- జెడ్పీచైర్మన్ లోకనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి టౌన్, డిసెంబర్ 17 : ఎదిగేందుకు పేదరికం అడ్డుకాదని నైపుణ్యాలు ప్రదర్శిస్తే విజయాలు వరిస్తాయిని జెడ్పీచైర్మన్ లోకనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో బాలకృష్ణ క్రీడా ప్రాంగణంలో 67వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్14అండర్, 17 బాలబాలికల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. 10 ఉమ్మడి జిల్లాల నుంచి 600 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గెలుపోటములు క్రీడాకారులు సమానంగా స్వీకరించాలని క్రీడల వల్ల చదువుతో పాటు శారీరక మానసిక ఉల్లాసం ఆరోగ్యానిస్తుందన్నారు. అనంతరం జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ బాలబాలికలు ఎదిగేందుకు ఆటలు చదువులో రాణించేందుకు పేదరికం అడ్డుకాదని అందించిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని నైపుణ్యాల ప్రదర్శనతో మేరుగైన విజాయాలు వరిస్తాయని క్రీడాకారులకని సూచించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న క్రీడా ప్రాంగణంలోని సమస్యలను వివరించారు. అనంతరం క్రీడల ప్రతిజ్ఞ జెండా ఆవిష్కరించారు. అలాగే క్రీడాకారులు మార్చ్‌పాస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్‌చైర్మన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్స్ బ్రహ్మం, సత్యంసాగర్, పుట్టపాకుల మహేశ్, కృష్ణకుమార్‌రెడ్డి, చంద్రశేఖర్,వ్యాయమ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి

అక్షరను సన్మానిస్తున్న సాహితీకళావేదిక ప్రతినిధులు

వనపర్తి టౌన్, డిసెంబర్ 17 : చిన్నారులలో సృజనాత్మకతను పెంపొందించాలని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. సమగ్రశిక్ష పాఠశాల విద్యాశాఖ పక్షాన వచ్చే నెలలో జాతీయస్థాయిలో నిర్వహించే కళా ఉత్సవ్ పోటీలకు 2డీ దృశ్యకళా (విజువల్ఆర్ట్2డీ) విభాగంలో ఎంపికైన అక్షరను ఆదివారం సాహితీ కళావేదిక ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలో పుట్టుకతో సహజంగా వచ్చే సృజనాత్మకతను ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందని అభిప్రాయపడ్డారు. కళల పట్ల ఏకాగ్రత పెరగడమేగాక మానసిక వికాసం అభివృద్ధి చెందుతుందని, చిన్నతనం నుంచే వాటిపై ఆసక్తిని పెంపొందించడం వల్ల భవిష్యత్తులో మరింత ప్రతిభను సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. జనవరి 9 నుంచి 12 వరకు ఢిల్లీలో నిర్వహించే పోటీల్లో పాల్గొనబోతున్న అక్షర ను ఆమె నివాసంలో కళావేదిక సభ్యులు శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. కార్యక్రమంలో కవి జనజ్వాల, హెచ్ఎం చంద్రశేఖర్, మద్దిలేటి, బైరోజు చంద్రశేఖర్, శ్రీనివాసులు, రవీందర్‌గౌడ్, లావణ్య ఉన్నారు.

బాలసదన్‌లో ఇంటి వాతావరణంకల్పించాలి

చిన్నారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్

నారాయణపేట టౌన్, డిసెంబర్ 17 : బాలసదన్‌లో ఇంటి వాతావరణం కల్పించాలని అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ అన్నారు. ఆదివారం పట్టణంలోని బాలసదన్, వృద్ధాశ్రమాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా బాలసదన్‌లో వసతి ఏర్పాట్లు, వృద్ధాశ్రమంలో కల్పిస్తున్న సౌకర్యాలను, భోజనవసతి తదితర వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పించే అన్ని సదుపాయాలను కల్పించాలన్నారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో వేణుగోపాల్, బాలసదన్ తదితరులు పాల్గొన్నారు.

టెక్నికల్ కోర్సు పరీక్షలకు దరఖాస్తులు

నారాయణపేట రూరల్, డిసెంబర్ 17 : డాయింగ్, టైలరింగ్, ఎంబ్రైడరీలో లోయర్, హయ్యర్ గ్రేడ్‌లలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలకు గాను దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు డీఈవో అబ్దుల్‌గని తెలిపారు. తెలంగాణలోని అన్ని జిల్లాలో ఫిబ్రవరి 2024లో పరీక్షలు నిర్వహించనుండగా ఈ నెల 29 లోపు రుసుము చెల్లించవచ్చని, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని డౌన్‌లోడ్ చేసిన దరఖాస్తును డీఈవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ సమర్పించాలన్నారు. ఏడో తరగతి పాస్ అయిన వారు లోయర్‌గ్రేడ్ పరీక్షలకు అర్హులన్నారు. లోయర్‌గ్రేడ్ పాస్ అయిన వారు హయ్యర్ గ్రేడ్ పరీక్షలకు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జనసంద్రంగా మారిన బనదేశ్వర ఆలయం

నారాయణపేట రూరల్, డిసెంబర్ 17 : తెలంగాణ, కర్నాటక సరిహద్దులోని కళబెళగుంది బనదేశ్వర ఆలయం జాతర ఉత్సవాల సందర్భంగా భారీగా ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అలంకరణతో పాటు ప్రత్యేక పూజలు చేశారు.జాతర సందర్భంగా స్వామి వారికి విశేష అలంకరణ చేపట్టారు. వివిధ ప్రాంతాల నుండి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు జనంతో కిక్కిరిసిపోయింది. ఆదివారం అర్ధరాత్రి రథోత్సవం భక్తజనం కోలాహలం మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నేడు పల్లకీసేవ, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

శాఖాహారంతోనే ఆరోగ్యం

ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్, డిసెంబర్ 17 : శాఖాహారంతోనే మంచి ఆరోగ్యం లభిస్తుందని స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పిలుపునిచ్చా రు. ఆదివారం పట్టణంలోని పడమటి ఆంజనేయస్వామి ఆలయం నుంచి మాంసహారం మానండి! శాఖాహారమే ముద్దు ! అంటూ నినాదంతో మాతా మాణికేశ్వరి ట్రస్ట్, పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ఆధ్వర్యంలో సంయుక్తంగా పట్టణంలో శాఖాహార ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జెండా ఊపి ఎమ్మెల్యే ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ తాను యాధృచ్ఛికంగా శాఖాహారిగా మారిపోయాయన్నారు. కార్యక్రమంలో పిరమిడ్ సభ్యులు బండ్ల ఆంజనేయరెడ్డి, నర్వ ఎంపీపీ జయరాములు, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, కావలిహరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం

మక్తల్ టౌన్, డిసెంబర్ 17 : పట్టణంలో విశ్రాంత ఉద్యోగులు ఘనంగా పెన్షనర్స్ దినత్సోవం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సత్యసాయి మందిరంలో అధ్యక్షుడు బి.గోపాలం అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరై పెన్షనర్లను సన్మానించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్స్ అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు బి.గోపాలం బి. భాస్కర్, కోశాధికారి సిద్ధి లింగయ్య, ఉపాధ్యక్షుడు సూర్యప్రకాశ్, జి.నాగప్ప తదితరులు ఉన్నారు.

ప్రారంభానికి ముస్తాబైన జీపీ భవనం

ముస్తాబైన పంచాయతీ నూతన భవనం

ధన్వాడ, డిసెంబర్ 17 : మండలంలోని ఏంనోనిపల్లి గ్రామ పంచాయతీ నూతన భవనం ప్రారంభానికి ముస్తాబైంది. కేసీఆర్ సర్కార్ హయాంలో మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్ రెడ్డి రూ.20 లక్షలు మంజూరు చేయగా, భవన నిర్మాణం పూర్తయిందని సర్పంచ్ భారతిసచిన్ తెలిపారు. నూతన పంచాయతీగా ఏర్పడిన ఏంనోనిపల్లిలో అన్ని హంగులతో త్వరలోనే ప్రారంభిస్తారని ఆమె తెలిపారు. భవనం మంజూరుకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పగలే వెన్నెలాయే..!

కృష్ణ, డిసెంబర్ 17 : విద్యుత్ ఆదాచేయాలని పదేపదే చెబుతున్నా మీటర్లు బిగించినా వీధి దీపాలు ఆపే నాథుడు లేక పట్టపగలు వీధిదీపాలు మండలంలోని హిందుపూర్, ముడుమాల, మురహరిదొడ్డి తదితర గ్రామాల్లో వీధిదీపాలు నిరంతరం వెలుగుతున్నాయి. గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో వీధిదీపాలు పగలంతా వెలుగుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం వలన విద్యుత్ వృథాగా ఖర్చవుతుంది. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

పగలే వెలుగుతున్న వీధి దీపం